క్లుప్తంగా

అర్చక సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడుగా సురేష్ శర్మ



రేపల్లె: అర్చక సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడుగా మోర్తోట గ్రామంలోని ముక్తేశ్వరస్వామి ఆలయ అర్చకుడు చావలి సురేష్‌శర్మ ఎంపికయ్యారు. ఇటీవల పట్టణంలోని ఇసుకపల్లి శివాలయంలో నిర్వహించిన అర్చకుల సమావేశంలో సురేష్‌శర్మను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఏపీ అర్చక సమాఖ్య అధ్యక్షుడు అగ్నిహోత్రం ఆత్రేయబాబు, బాపట్ల జిల్లా ప్రాంతీయ అర్చక సమాఖ్య అధ్యక్షుడు నారాయణం శరత్‌చంద్‌లు ప్రకటించి మంగళవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌శర్మ మాట్లాడుతూ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడుగా అర్చక సమాఖ్య తనకు అప్పచెప్పిన బాధ్యతను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన అధ్యక్షుడు నారాయణం శరత్ చంద్‌కి, ప్రధాన కార్యదర్శి బృందావనం ఫణికుమార్‌కు, బాపట్ల జిల్లా ప్రాంతీయ అర్చక సమాఖ్య కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రామిక గర్జనను విజయవంతం చేయాలి

భట్టిప్రోలు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు విజయవాడలో నిర్వహించ తలపెట్టిన శ్రామిక మహాగర్జనను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను హరిస్తుందని ఆరోపించారు. బుధవారం క్విట్ ఇండియా డే సందర్భంగా విజయవాడలో శ్రామిక గర్జన సభ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బగళాముఖి ఆలయంలో హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు శీఘ్రముగా వివాహం జరిగేందుకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

జ్యోతిష్య పండితుడు శర్మదకు సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన విశ్రాంత ఆంధ్రోపాధ్యాయులు, జ్యోతిష్య పండితుడు శర్మదను మంగళవారం బ్రాహ్మణపరిషత్, తెనాలి కార్యాలయంలో సత్కరించారు. జ్యోతిష్య శాస్త్రంలో చేస్తున్న సేవలను కొనియాడారు. అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న ఏలూరులో జరిగిన జరిగిన గురుపురస్కారాల్లో రాష్ట్ర దేవదాయ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, మహాసంఘం అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ చేతుల మీదుగా శర్మదకు జ్యోతిష్యరత్న, కవితా భారతి బిరుదులను ప్రదానంచేసి సత్కరించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణపరిషత్ ఆయన స్వస్థలమైన తెనాలిలో సత్కరించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ, అధ్యక్షుడు పరాశరం వెంకట రామగోపాల్, వడ్లమాని ఉమామహేశ్వరరావు, వంగల మాధవరావు, త్రిపురారిభట్ల దత్తు, చెన్నాప్రగడ శ్రీనివాస్, దావులూరి శ్యాం, కావూరి సత్యనారాయణ, మాగంటి శాస్త్రి, లక్కరాజు లక్ష్మణరావు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

తెనాలిరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు తెలిపారు. తెనాలి మార్కెట్ యార్డులో వాహన దారులతో మంగళవారం ఆయన మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, యూనిఫాం ఖచ్చితంగా ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ఆయన వెంకట ఏఎంవీఐ మధుసూదనరావు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి
- మంతెనవారిపాలెం గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరించి, సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి అన్నారు. పిట్టలవాని పాలెం మండలం మంతెనవారిపాలెంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ లక్కంరాజు ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రాహేలు, పార్టీ నాయకులు నర్రా శ్రీనివాసరావు, బోరుగడ్డ ఆదాంల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అంటూ ప్రజలను ఆరా తీశారు. అలాగే గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కోన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు నియోజకవర్గ ప్రజలంతా బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గడప గడపలో అపూర్వ స్వాగతం లభిస్తోందన్నారు. గతంలో రాజకీయ నాయకుడు వస్తున్నాడంటే సమస్యలు స్వాగతం పలికేవని, కానీఇప్పుడు సంక్షేమ ఫలాలతో ప్రతి కుటుంబం కళకళలాడుతోందన్నారు. గ్రామంలో లక్షల రూపాయలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బాజి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు చేబ్రోలు కృపానందం, బాపట్ల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ మండే విజయ్‌కుమార్, పార్టీ నాయకులు బడుగు ప్రకాశరావు, చేబ్రోలు వీరయ్య, కొర్లపాటి సురేష్, వెంకటపతిరాజు, ఎనుముల కోటేశ్వరరావు, చేబ్రోలు రవికుమార్, శ్యామల నాగిరెడ్డి, మంతెన గంగరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, దబ్బుకూటి మాధవరావు, కూసంపూడి దేవేంద్రరాజు, కుంతం ప్రసన్నరాజు, యోహాను, అధికారులు భవనం మారుతీ శేషమాంబ, కె.పద్మజ, వసుంధర లక్ష్మి, నాయకులు ఉన్నారు.

రిటర్నింగ్ అధికారుల నియామకం



రాంబొట్లపాలెం పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ చూపుతున్న అధికారులు

చెరుకుపల్లి: మండలంలోని రాంబొట్లపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులను నియమించినట్టు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంబొట్ల పాలెం పంచాయతీకి స్థానిక పంచాయతీరాజ్ ఏఈ ఫిరోజ్‌లాల్‌ను, తుమ్మల పాలెం పంచాయతీకి మండల విద్యాశాఖ అధికారి పులి లాజర్‌ను రిటర్నింగ్ అధికారులుగా నియమించారన్నారు. ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద ఎన్నికల నోటిఫికేషన్‌ను నోటీస్ బోర్డులో పెట్టారు. పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల పదో తేదీ ఐదు గంటల లోపు నామినేషన్లు దాఖలు చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.

ప్రజాగాయకుడు గద్దర్‌కు నివాళి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

బాపట్ల: ప్రజా గాయకుడు గద్దర్‌లేని లోటు తీర్చలేనిదని ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్ నాయకుడు బండికళ్ల బాబురావు పేర్కొన్నారు. బాపట్ల అంబేడ్కర్ సర్కిల్‌లో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి మంగళవారం నివాళులర్పించారు. ఈసందర్భంగా బండికళ్ల బాబురావు మాట్లాడుతూ కారంచేడు, చుండూరు ఉద్యమాల్లో గద్దర్ పాత్ర కీలకమని గుర్తు చేసుకున్నారు. బీటీఏ నాయకుడు గడ్డం ఏలియా మాట్లాడుతూ గద్దర్ మృతికి ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంతిమయాత్ర జరిపి, తెలుగు రెండు రాష్ట్రాలు సంతాపం తెలియజేయడం గొప్ప విశేషమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాతం బాబురావు, పల్నాటి శ్రీరాములు, జెట్టి జోసెఫ్, దాసరి లక్ష్మీ, దాసరి బాబురావు, కాగిత కోటేశ్వరరావు, మందపాటి పరమానందం, పీసీ సాయిబాబు, దోనేపూడి రవికుమార్, ఇనుపగొల్ల రంగారావు, కరాటే రవి, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులతో ఆరోగ్య సమస్యలు



నగరంలో నులిపురుగుల నిర్మూలన పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, సీహెచ్‌ఓ

నగరం: నులి పురుగుల వల్ల రక్తహీనతతో పాటు ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నులి పురుగుల నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎంపీడీఓ మాట్లాడుతూ నులి పురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. ఈనెల 10 నుంచి 17వ తేదీవరకు సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ధూళిపూడి పీహెచ్‌సీ పరిధిలో 4600 మందికి ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. సీహెచ్‌ఓ బాబురావు, ఏఎన్ఎం విమల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అదేవిధంగా నగరం ప్రాథమికోన్నత పాఠశాల, అల్లపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధూళిపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నులి పురుగుల నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహించారు. సీహెచ్‌ఓ బాబురావు నులి పురుగుల వల్ల వచ్చే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పశుపోషకులకు అందుబాటులో ఉండాలి

జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎం.హనుమంతరావు

బాపట్లటౌన్: పారా వెటర్నరీ సిబ్బంది పశుపోషకులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి ఎం.హనుమంతరావు తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని పారా వెటర్నరీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పశుసంవర్ధకశాఖ ద్వారా అమలయ్యే కార్యక్రమాల నిర్వహణలో పారా వెటర్నరీ సిబ్బంది పాత్ర కీలకమైందన్నారు. వీరంతా పశుపోషకులకు అందుబాటులో ఉండి పశువైద్య సేవలు అందించాలన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు పశుపోషణ నిమిత్తం నిర్వహణ ఖర్చుల కింద ఒక్కో రైతుకు రూ. లక్ష వరకు వడ్డీలేని రుణాన్ని ఇప్పించేందుకు దరఖాస్తు చేసే విధానంపై క్షుణ్ణంగా పశు పోషకులకు వివరించాలన్నారు. ఒంగోలు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌బాబు, కార్యాలయ టెక్నికల్ పశువైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

50 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను పారబోస్తున్న సెబ్ సిబ్బంది

రేపల్లె: నాటుసారాను విక్రయించినా, తయారు చేసినా చర్యలు తప్పవని సెబ్ సీఐ లీనా అన్నారు. మండలంలోని గుడ్డికాయలంక గ్రామంలో మంగళవారం సెబ్ సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించారు. ప్రభుత్వ నిషేధిత పదార్థాలను ఎవరైనా తయారు చేసినా, విక్రయించినా గ్రామస్తులు తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గుడ్డికాయలంక గ్రామంలో ఉయ్యూరు సామ్రాజ్యం గృహంలో దాడులు నిర్వహించగా నాటుసారా తయారు చేసే 50 లీటర్ల బెల్లం ఊట, 4 లీటర్ల నాటుసారా లభ్యమయ్యాయన్నారు. వీటిని ధ్వంసం చేసినట్లు చెప్పారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

11వ అదనపు జిల్లా న్యాయమూర్తి మాలతి



తెనాలిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగపర్చుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. మాలతి సూచించారు. సెప్టెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం ఆమె ప్రకటనల విడుదల చేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించనున్న అదాలత్‌లో కేసులు రాజీ అవడం ద్వారా కక్షిదారులకు ఆర్థిక పరంగానూ వెసులుబాటు కలుగుతుందని, కోర్టుల్లో ఉన్న కేసులనూ రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కేసుల లిటిగేషన్ విపరీతంగా పెరగడం వల్ల వాటిని పరిష్కరించే దిశలో లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సివిల్ కేసులు ఏ దశలో ఉన్నా పరిష్కరించుకోవచ్చని సూచించారు. రాజీ కాదగిన సివిల్, క్రిమినల్, ప్రి లిటిగేషన్, వాహనాలు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. ప్రజలందరూ న్యాయశాఖ ఇచ్చిన లోక్ అదాలత్‌ను వినియోగించుకోవచ్చన్నారు.

ఇష్టంతో కష్టపడి పనిచేస్తే విజయం దరిచేరుతుంది

మాజీ క్రికెటర్ అంబటి రాయుడు



మాట్లాడుతున్న అంబటి రాయుడు

మేడికొండూరు: ఏరంగంలోనైనా లక్ష్యం దిశగా ఎంత కష్టమైనపని అయినా ఇష్టంతో చేస్తే విజయం దరి చేరుతుందని మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు అన్నారు. మండలంలోని మేడికొండూరు, డోకిపర్రు గ్రామాల్లో అంబటి రాయుడు మంగళవారం పర్యటించారు. తొలుత మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సమృద్ధిగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హైస్కూల్ క్రీడా మైదానంలో కొద్దిసేపు విద్యార్థులతో క్రికెట్ ఆడారు. అనంతరం డోకిపర్రు గ్రామంలోని ఎంపీయూపీ స్కూలును సందర్శించారు. పలువురు రైతులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. డోకిపర్రు సమీపంలోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థులతో కొద్దిసేపు క్రి కెట్ ఆడి ఉత్సాహపర్చారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ క్రియాశీలకమని గుర్తుచేశారు. విద్యార్థి దశలో సమయం వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యారంగంతోపాటు తమకు ఇష్టమైన క్రీడలో కూడా రాణించాలని అన్నారు. తల్లిదండ్రులు మనపైన పెట్టుకున్న నమ్మకామన్ని వమ్ము చేయకుండా ఒక సముచిత స్థానంలో నిలిచేదాక ముందుకు సాగాలని అన్నారు. ప్రతి విద్యార్థి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. ప్రతి విద్యార్థి ఇతరులకు ఆదర్శవంతమైన విధానంలో ముందుకు సాగాలని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, ఉడతా శంకర్, షేక్ గాలిబ్, డోకిపర్రు గ్రామ సర్పంచ్ కొండెపోగు సామ్రాజ్యం పాల్గొన్నారు.

'నా మట్టి - నా దేశం'ను విజయవంతం చేయండి

పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవం-నామట్టి నాదేశం కార్యక్రమాలను నిర్వహించాలని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాలలో ఈనెల 9 నుంచి 15వ తేదీవరకు కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. శిలా ఫలకాల ఏర్పాటు, పంచ ప్రాణప్రతిష్ఠ, వసుధ వందనం, మొక్కలు నాటుట, వీరులకు వందనం, జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఈకార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనేలా ప్రచారం చేయాలని తెలిపారు.

ఓటర్ల జాబితా సర్వే వేగవంతం చేయాలి

రేపల్లె రూరల్: నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల సర్వేను వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి జూపీటర్ సూచించారు. ఓటర్ల సర్వేపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం అధికారులు, వివిధరాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో విస్తృతంగా జరుగుతున్న సర్వేపై అభ్యంతరాలు ఉంటే ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజెప్పాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కు పొందేలా అధికారులతో పాటు ఆయాపార్టీల ప్రతినిధులు చైతన్యపరచాలని కోరారు. అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కావ్య సంకలనంలో ప్రజ్ఞాచారి పద్యాలు



తెనాలి: రూరల్ మండలం కొలకలూరుకు చెందిన జాతీయ అంబేడ్కర్ అవార్డుగ్రహీత నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి ఆకలి శీర్షికతో రాసిన పద్యాలు ఆధునిక ఆంధ్ర అష్ట దిగ్గజకవుల భువన విజయం సంకలనంలో ప్రచురణకు ఎంపికై ంది. ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న ఈ కావ్య సంకలనం ఆవిష్కరణ సందర్భంగా ఈనెల 15వ తేదీన హైదరాబాద్‌లోని సూరారం విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో వేదికపై ప్రజ్ఞాచారిని సత్కరించనున్నట్టు నిర్వహణ కమిటీ తెలియ జేసింది. మధురకవి నూతక్కి అబ్రహాం కుమారుడైన ప్రజ్ఞాచారి మాట్లాడుతూ విలువ కలిగిన సాహిత్యానికి ఎక్కడైనా, ఎప్పుడైనా తగిన గౌరవం లభిస్తోందని చెప్పారు. తనను సాహితీరంగంలో ప్రోత్సహించిన తన తండ్రికి నివాళులర్పిస్తూ, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తన సాహిత్యంతో పలు అవార్డులను స్వీకరిస్తున్న ప్రజ్ఞాచారిని గ్రామస్తులు, ఎమ్మార్పీయస్ నాయకులు అభినందించారు.

దివ్యాంగులకు అన్నదానం

మంగళగిరి: ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం దివ్యాంగులకు, పేదలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్మీ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ట్రస్ట్ సెక్రటరీ గరికముక్కు డేవిడ్, ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు, సీపీఐ నాయకులు గంజి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సర్పంచి చీరాల వెంకటలక్ష్మి

పిట్టలవానిపాలెం: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని యేట్రవారి పాలెం గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి తెలిపారు. కర్లపాలెం మండలం యేట్రవారిపాలెం గ్రామ సచివాలయంలో మంగళవారం యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ సంస్థ సహకారంతో బాల్య వివాహాలు, బాలికలపై లైంగిక వేధింపులు, బాలకార్మిక వ్యవస్థపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కో-ఆర్డినేటర్ అడుసుమల్లి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ బాలికలతో సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. బాలికలను సోదర భావంతో చూడాలన్నారు. అసభ్యకరంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు గురి చేసినా జైలు పాలు కావడం ఖాయమన్నారు. నాగరాజు, బడుగు కిషోర్, సచివాలయ కన్వీనర్ చీరాల శ్రీనివాసరెడ్డి, ఏఎస్ఐ సాంబశివరావు, సచివాలయ మహిళా సంరక్షకురాలు కృష్ణవేణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు ఉన్నారు.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌పై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ చంద్

తెనాలిఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా నోడల్ అధికారులు డాక్టర్ టి.వినిల్, డాక్టర్ సురేష్‌చంద్‌లు సూచించారు. తెనాలి జిల్లా వైద్యశాలలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంపై మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో పేర్లు నమోదు చేయించుకుని, ప్రభుత్వం కేటాయించిన డిజిటల్ నంబర్‌ను భద్రపరుచుకోవాలని సూచించారు. దీని వల్ల దేశంలోని ఏ ప్రాంతంలో అయిన డిజిటల్ నంబర్ తెలియజేసి చికిత్స పొందవచ్చని చెప్పారు. అలాగే ప్రతి వ్యక్తి యొక్క అనారోగ్య, చికిత్స వివరాలు కూడా యాప్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. ఇలా చేయడం వల్ల రోగిపై వైద్యునకు అవగాహన రావడంతో పాటు గతంలో అందించిన చికిత్స వివరాలు కూడా వైద్యులకు తెలిసే అవకాశం ఏర్పాడుతుందన్నారు. తద్వారా రోగికి మెరుగైన వైద్యం అందే అవకాశం ఉందని చెప్పారు. సమావేశంలో స్టాఫ్ కో-ఆర్డినేటర్ సుశీల, డిస్ట్రిక్ నోడల్ మేనేజర్ ప్రదీప్, ప్రత్తిపాడు, కొల్లిపర, పొన్నూరు, సత్తెనపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలల వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

సమాజ చైతన్య బావుటాలు జాన్సన్ రచనలు



జాన్సన్ చిత్రపటం వద్ద ప్రముఖులు, కుటుంబ సభ్యుల నివాళి

తెనాలి: ప్రముఖ కవి, నాటక, సినీ రచయిత మోదుకూరి జాన్సన్ రచనలు ప్రజా చైతన్య బావుటాలు...సమాజ శ్రేయస్సే లక్ష్యంగా ఆయన వివిధ ప్రక్రియల్లో రచనలు చేశారని మంగళవారం జరిగిన 89వ జయంతి సభలో పలువురు స్మరించుకున్నారు. ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. తెనాలికి చెందిన మోదుకూరి జాన్సన్ జయంతి సభను మోదుకూరి జాన్సన్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని అదితి గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటూరు కృష్ణ అధ్యక్షత వహించారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు మాట్లాడుతూ తెనాలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన జాన్సన్, సినీరంగానికి వెళ్లి, తన ప్రతిభతో చిరస్మరణీయుడైనట్టు గుర్తుచేశారు. గుర్రం జాషువా విజ్ఞాన సమితి కార్యదర్శి పినపాటి రవికుమార్ మాట్లాడుతూ నాటక రచయితగా, సినీ పాటలు, సంభాషణల రచయితగా జాన్సన్ లబ్ధప్రతిష్ఠుడని చెప్పారు. న్యాయవాది మేకల రవికుమార్ తన ప్రసంగంలో నాటకరంగం నుండి సినీరంగానికి ఎదిగిన జాన్సన్‌ను స్ఫూర్తిప్రదాతగా చెప్పారు. తాము అడిగిన వెంటనే తెనాలి బండ్‌పై జాన్సన్ విగ్రహ ప్రతిష్ఠకు అంగీకారం తెలిపిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు గుంటూరు కృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు. సహజకవి అయినాల మల్లేశ్వరరావు, కనపర్తి బెన్‌హర్, అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, న్యాయవాదులు కంచర్ల చంద్రశేఖర్, సోలా శంకర్, కంచర్ల కోటేశ్వరరావు, మూల్పూరు లాజర్, కొమ్ము అబ్రహాం లింకన్ పాల్గొన్నారు. తొలుత జాన్సన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ప్రయోగాత్మక రచయిత మోదుకూరి జాన్సన్

తెనాలి: 'నటనాలయం' సృష్టికర్త, అగ్నికవి, కాకికవిగా గుర్తింపు పొందిన ప్రముఖ కవి, రచయిత మోదుకూరి జాన్సన్ 89వ జయంతి సభను మంగళవారం సాయంత్రం స్థానిక పెన్షనర్స్ సంఘ భవనంలో నిర్వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పీజే రత్నాకర్ అధ్యక్షత వహించారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన జాన్సన్, నటనాలయం నాటకంతో ఆ రంగంలో కొత్త ఒరవడిని సృష్టించినట్టు డాక్టర్ రత్నాకర్ చెప్పారు. తన అసమాన ప్రతిభతో సినీరంగానికి ఎదిగారని అన్నారు. నిమ్న, అణగారిన జాతుల ఆవేదనను కాకి గేయంలో వర్ణించినట్టు గుర్తుచేశారు. కావ్యాన్ని స్త్రీరూపంగా కాకుండా పురుష రూపంలో వర్ణించటం ద్వారా ప్రయోగాత్మక రచయితగా జాన్సన్ నిలిచారని వివరించారు. సినిమాల్లో సంభాషణలు, పాటలు వినగానే జాన్సన్ రచించినట్టు తెలిసిపోయేంత ప్రత్యేకత ఆయన కలంలో ఉందన్నారు. జాన్సన్ జీవిత విశేషాలను గురించి వక్తలు డాక్టర్ వల్లూరి రామారావు, సీనియర్ ఏపీపీ సుద్దపల్లి సుకుమార్, విశ్రాంత చీఫ్‌ఇంజినీరు పొన్నెకంటి కరుణాకర్, డాక్టర్ కొత్తపల్లి రాజకుమార్, పినపాటి రవికుమార్, కొండముది రమేష్, న్యాయవాది ఇందుపల్లి రాజారామ్, సుద్దపల్లి మురళీధర్, దారివేముల అనిల్‌కుమార్, కుటుంబసభ్యులు మోదుకూరి లీలాగురుమోహన్, గురుదేవ్, శైలేంద్ర పాల్గొన్నారు. ముందుగా జాన్సన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మంద్రపాటి అజిత్(21)

కొల్లిపర: కొల్లిపర నుంచి హన్‌మాన్‌పాలెం గ్రామానికి వెళ్లే కృష్ణా నది కరకట్ట రహదారిపై మంగళవారం ప్రమాదవశాత్తు ఇసుక లారీ బైకు ను ఢీ కొనడంతో యువకుడి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటపై ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపిన వివరాల మేరకు చివలూరు గ్రామానికి చెందిన యంద్రపాటి అజిత్(21) తన బాబాయ్ కుమారైను కొల్లిపరలో ని కృష్ణానదిలో వరద నీరు చూపించి తిరిగి చివలూరు గ్రామానికి వస్తుతుండగా ఇసుక లారీ కరకట్టపైకి వచ్చిన తరువాత ప్రమాదవశాత్తు బైకు ఢీ కొట్టడంతో బైకు పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 ద్వారా స్థానిక ప్రాథమిక వైద్య శాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే అజిత్(21) మృతి చెందినట్లు వైద్యులు తెలిపిన్నట్లు ఎస్ఐ తెలిపారు. అజిత్ టైల్స్ పని చేసుకుంటు జీవిస్తున్నాడు. తన వెంట వచ్చిన చెల్లికి స్వల్పంగా గాయాలతో బయటపడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.